సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 23 । జూలై । 2024



వరి రైతులకు సూచనలు

వరి నారుమడుల సంరక్షణలో జాగ్రత్తలపై ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రైతులకు సూచనలు, సలహాలు అందించారు. 8లో



శాకంబరిగా దేవతామూర్తులు

పాడేరులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పలు దేవతామూర్తులు శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు 8లో



గరీబ్‌రథ్.. న్యూ లుక్ 8లో

విశాఖ – సికింద్రాబాద్ మధ్య నడిచే గరీబ్ రథ్ ఇక నుంచి కొత్త లుక్‌లో కనిపించనుంది. ఎల్‌హెచ్‌బీ బోగీలతో దూసుకుపోనుంది.

న్యూస్‌రీల్

జేసీగా అభిషేక్ గౌడ్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, పాడేరు: నూతన జాయింట్ కలెక్టర్‌గా డాక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్ సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ/వార్డు సచివాలయాల శాఖలో ఏడీగా పనిచేశానని, ప్రభుత్వం ఇక్కడ జేసీగా బదిలీ చేసిందన్నారు. గతంలో తాను అసోంలో కొంతకాలం పనిచేసినందున గిరిజన ప్రాంతంపై అవగాహన ఉందన్నారు. ఈ ప్రాంతంలో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. చింతూరు డివిజన్‌లో వరదలు కారణంగా సహాయక కార్యక్రమాలకు తరలి వెళుతున్నానని తెలిపారు. అక్కడ బాధితులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీని చేపడతామన్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: భారీ వర్షాలు,వరదలు కారణంగా మంగళవారం జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్టు కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు సెలవు అమలుజేయాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బయటకు పంపవద్దని సూచించారు. అలాగే ప్రజలు గెడ్డలు, వాగులు దాటే సాహసం చేయవద్దన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కలెక్టర్ కోరారు.

సీహెచ్‌సీలో డీసీహెచ్‌ఎస్ తనిఖీలు



సూపరింటెండెంట్ రాహుల్‌తోపాటు వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీసీహెచ్‌ఎస్

వై.రామవరం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డీసీహెచ్‌ఎస్ (జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి) డాక్టర్ కృష్ణారావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ ఆస్పత్రిలోని అన్ని విభాగాలను సందర్శించారు. రికార్డులతోపాటు ల్యాబ్‌లో చేస్తున్న రక్త పరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్ పరిశీలించారు. ఇన్‌పేషంటు వార్డు రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా ప్రసవాలు, మలేరియా, తదితర జ్వరాల కేసుల నమోదుపై ఆరా తీశారు. మందుల స్టాకు రూమ్‌ను పరిశీలించారు. ఆస్పత్రి సిబ్బంది వివరాలు, అవసరమైన సౌకర్యాల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్‌ను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలందించి ఆస్పత్రికి మంచి పేరు తేవాలని సిబ్బందికి సూచించారు. వైద్యాధికారులకు, సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ చైతన్యకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరులో మూలకు చేరిన మూడు యూనిట్లు

కేవలం మూడో యూనిట్ ద్వారా ఉత్పత్తి

సీలేరు: సీలేరు జలవిద్యుత్కేంద్రంలో మూడు యూనిట్లు మరమ్మతులకు గురయ్యాయి. కేవలం ఒక్క యూనిట్‌తోనే ఉత్పత్తి చేస్తున్నారు. రెండు నెలల క్రితం మొదటి యూనిట్‌లో స్టార్టర్ బార్లు కాలిపోయాయి. ఈ మరమ్మతులను అభిరామి ఇంజినీరింగ్ కంపెనీకు పనులు అప్పగించారు. ఈ యూనిట్‌కు సంబంధించి డ్రాఫ్ట్ ట్యూబ్ గేట్లు మరమ్మతులు చేస్తుండటంతో ఇబ్బంది రాకుండా ఉండేందుకుగాను ముందు జాగ్రత్త చర్యగా రెండో యూనిట్ నుంచి విద్యుదుత్పత్తి నిలిపివేశారు. సోమవారం ఈ యూనిట్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నించగా, మెగ్గర్ వాల్యూ రాకపోవడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. నాలుగో యూనిట్‌లో స్టార్టర్ ఎర్త్ సమస్య రావడంతో ఆ యూనిట్ నుంచి విద్యుదుత్పత్తి నిలిపివేశారు. నాలుగో యూనిట్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి స్థానిక ఇంజినీర్లు, సిబ్బంది ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం మూడో యూనిట్ ద్వారా మాత్రమే విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వర్షాలు పడటంతో సీలేరు జలాశయం ప్రమాద స్థాయికి చేరుకున్న సమయంలోనూ సీలేరు జలవిద్యుత్కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేయలేకపోవడం శోచనీయం.

వరద ముంపులోనే...

- గోదావరి, శబరి నదుల ఉధృతి
- భద్రాచలం వద్ద 2వ ప్రమాద హెచ్చరిక జారీ
- పునరావాస కేంద్రాలకు తరలుతున్న వరద బాధితులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ముమ్మరంగా సహాయక చర్యలు

గోదావరి ఉగ్రరూపానికి భద్రాచలం వద్ద 2వ ప్రమాద హెచ్చరిక దాటి వరద పోటెత్తుతోంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు శబరి, తాలిపేరు ప్రాజెక్టులు పొంగి ప్రవహిస్తున్నాయి. దాంతో వరద నీరు చేరిన పలు రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. జల దిగ్బంధనంలో చిక్కుకున్న గ్రామాల నుంచి పునరావాస కేంద్రాలకు వరద బాధితులు తరలివెళ్తున్నారు. పత్తి, తదితర పంటలు తడిచిముద్దయ్యాయి. వాగులు పొంగడంతో సకాలంలో వైద్యం అందక వృద్ధురాలితోపాటు గర్భస్థ శిశువు మృతి చెందారు. ఈ నేపథ్యంలో కలెక్టరు దినేష్‌కుమార్ వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.



పడవలో వడ్డిగూడెం వెళ్తున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్, ఎస్సై నాగరాజు



చింతూరు మండలం చట్టి వద్ద ఆంధ్రా, తెలంగాణ హైవేపై వరదనీరు



పునరావాస కేంద్రానికి తరలి వెళ్తున్న వరద బాధితులు

ఎటపాక: గోదారమ్మ ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దాటి వరద పోటెత్తుతోంది. దీంతో గోదావరి గండం తప్పదనే సంకేతాలతో విలీన మండలాల వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి 48 అడుగులకు చేరుకోవటంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. క్రమేమి పెరుగుతూ రాత్రి 7 గంటలకు 49.1 అడుగులకు చేరుకుంది. వరద గంట గంటకూ పెరుగుతూ ఉధృతంగా పరవళ్లు తొక్కుతోంది. మంగళవారం ఉదయానికి మూడో ప్రమాద హెచ్చరిక 53 అడుగులకు వరద చేరవచ్చని సీడబ్ల్యూసీ అధికారులు వెల్లడించారు. ఊహించని రీతిలో తెల్లవారే సరికి గ్రామాలను వరద నీరు చుట్టుముడుతుందని ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఎగువన తెలంగాణాలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల తాలిపేరు ప్రాజెక్టు నుంచి 25 గేట్లు పూర్తిగా ఎత్తి 43,713 క్యూసెక్కుల వరదను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. పాల్వంచ కిన్నెరసాని నది నుంచి వరదను గోదావరిలోకి వదులుతున్నారు. తెలంగాణాలో భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలకు తాలిపేరుకు వరద అంచనాలకు మించి వస్తోంది. ఇప్పటికే ఎటపాక మండలం రాయపపేట వద్ద జాతీయ రహదారి పైకి వరద చేరటంతో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. నెల్లిపాక నుంచి కూనవరం వెళ్లే రహదారిపై నెల్లిపాక, నందిగామ, మురుమూరు వద్ద రహదారిని వరద ముంచేసింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తోటపల్లి, నందిగామ, మురుమూరు సమీపంలో పత్తి చేలు నీటమునిగాయి.

వీఆర్‌పురం: భారీ వర్షాలకు గోదావరి, శబరి నదులకు వరద పోటెత్తుతోంది. దీంతో మండలంలోని నది పరివాహక గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వడ్డిగూడెం గ్రామాన్ని వరదనీరు చుట్టిముట్టడంతో గ్రామస్తులు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లారు. చింతరేగుబల్లి- కన్నాయిగూడెం, రామవరం -ఏపీగుడెం గ్రామాల వద్ద రహదారి పైకి వరదనీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం పడవ ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వడ్డిగూడెం గ్రామానికి తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్, ఎస్సై నాగరాజు పడవ ద్వారా వెళ్లి ఇళ్లలో ఎవరూ ఉండవద్దని పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని ఆదేశించారు.

చింతూరు: భారీ వర్షాలతో మూడ్రోజులుగా బెంబేలెత్తించిన శబరి నది సోమవారం కాస్త శాంతించింది. చింతూరు వంతెన వద్ద గరిష్టంగా 40 అడుగులకు చేరిన శబరి నీటిమట్టం 38.5 అడుగులకు తగ్గింది. మరోవైపు దిగువనున్న గోదావరి క్రమేపీ పెరుగుతుండడంతో దాని ఎగపోటు (బ్యాక్ వాటర్) కారణంగా శబరి తిరిగి క్రమంగా పెరుగుతోంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజల్లో మరోమారు ఆందోళన నెలకొంది.

రహదారులను వీడని వరద:

వరద నీరు ఇంకా రహదారులపైనే తిష్ట వేయడంతో నాల్గో రోజు పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. చింతూరు, వీఆర్‌పురం మండలాల నడుమ సోకిలేరు, జల్లివారిగూడెం, చీకటివాగుల వరదనీరు రహదారిపైనే ఉండడంతో మండలంలోని 22 గ్రామాలకు, చంద్రవంక వాగు కారణంగా కూనవరం మండలంతోపాటు మూడు గ్రామాలకు రాకపోకలు సాగలేదు. కుయిగూరు వాగు కారణంగా ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా చీకటి వాగు వరద కారణంగా చింతూరు నుంచి కంసులూరు, వేగితోట, కొల్లూరు, లక్ష్మీపురం, కన్నాయిగూడెం గ్రామాలకు కూడా రాకపోకలు కొనసాగలేదు.

చింతూరు చేరుకున్న లాంచీలు:

వరద సహాయక చర్యల్లో పాల్గొనే నిమిత్తం రెండు లాంచీలు సోమవారం చింతూరుకు చేరుకున్నాయి. వరద ఉధృతమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు వారికి అవసరమైన నిత్యావసరాలు, ఇతర వస్తువుల చేరవేతకు వీటిని వినియోగించనున్నారు. పడవల ద్వారా చింతూరు మండలంలోని వరద ప్రభావిత గ్రామాలకు 1,330 టార్పాలిన్లు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు.

పునరావాస కేంద్రాలకు వరద బాధితులు...

కూనవరం: ఎగువన కురుస్తున్న వర్షాలకు కూనవరం వద్ద శబరి, గోదావరి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. సోమవారం ఉదయం పోలీస్ సమీపంలోని ఉదయ భాస్కర కాలనీ ముంపునకు గురికావడంతో అక్కడ బాధితులను కోతుల గుట్ట పునరావాస కేంద్రానికి తరలించారు. సినిమా హాల్ సెంటర్లో రోడ్డుపైకి వరద చేరటంతో రాకపోకలు ఇక్కడ సగం ఇళ్లకుపైగా ఖాళీ చేసి పునరావాస కేంద్రానికి తరలి వెళ్లారు. నాలుగు రోజుల నుంచి కొండప్పేట టేకుల బోరు రహదారిపైన వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం టూ భద్రాచలం రహదారిపైన పోలిపాక సమీపంలో వరద చేరటంతో రాకపోకలు స్తంభించాయి. అత్యవసర పనుల మీద భద్రాచలం వెళ్లి తిరిగి వచ్చే ప్రయాణికులు ఏడుగురాళ్లపల్లి మార్గంలో నానా అవస్థలు పడుతూ కూనవరం కోతులు గుట్టకు చేరుకున్నట్లు తెలుస్తోంది.



చింతూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరినది



ముంపు ప్రాంతానికి ట్రాక్టర్‌పై వెళ్తున్న కలెక్టర్‌తోపాటు పీవో చైతన్య



వీఆర్‌పురం: శ్రీరామగిరి గ్రామంలో గృహాలను ముంచిన వరదనీరు

వరద బాధితులకు సకాలంలో సాయం

- కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు
- ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ దినేష్‌కుమార్ పర్యటన



చింతూరు మండలం చట్టి వద్ద హైవేను-30ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



చింతూరులో వరద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు: వరద బాధితులకు సకాలంలో సహాయ సహకారాలు అందించే విధంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఐటీడీఏలో ఏర్పాటు చేసిన వరద సహాయక కమాండ్ కంట్రోల్ రూంను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరదలపై ప్రజలకు ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం ఇవ్వాలని, మంచినీటి ప్యాకెట్లు అందజేయడంతోపాటు పాడైన బోర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, వరదల వల్ల దెబ్బతిన్న రహదారుల వివరాలపై తనకు నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని గుర్తించిన 226 మంది గర్భిణులను ముందుగానే ఆస్పత్రుల్లో చేర్పించామన్నారు. ప్రతి మండలంలో మొబైల్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వరద ప్రాంతాలకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి 1,132 మెట్రిక్ టన్నుల బియ్యం, ముందస్తుగా నిల్వ చేయగా, అందులో 554 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. దీంతోపాటు బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నామన్నారు.

మరింత అప్రమత్తంగా ఉండాలి:

చింతూరులో వరద ముంపు ప్రాంతమైన శబరి ఒడ్డును కలెక్టర్ పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఏటా వరదలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందచేసి పునరావాసం కల్పించాలని బాధితులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి తగిన చర్యలు చేపడతామని హామీనిచ్చారు. ఆంధ్రా, ఒడిశా జాతీయ రహదారి–326, ఆంధ్రా, తెలంగాణ జాతీయ రహదారి–30లపై చేరిన వరద నీటిని పరిశీలించి రాకపోకలను నిలిపివేయాలని ఆదేశించారు. అనంతరం కూనవరం మండలం చినార్కూరు వద్ద అటవీ ప్రాంతంలో వరద బాధితులతో మాట్లాడారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఐటీడీఏ పీవోలు సూరజ్ ధనుంజయ్ గనోరే, కావూరి చైతన్య, పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళవందనం, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీపీవో కొండలరావు పాల్గొన్నారు.

ముంపు మండలాలకు ప్రత్యేక అధికారులు

కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు: వరద సహాయక చర్యల పర్యవేక్షణ నిమిత్తం ముంపు మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కూనవరం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు, రంపచోడవరం సబ్ కలెక్టర్‌తోపాటు నలుగురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను నియమించినట్లు పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో ఎప్పటికప్పుడు వరద సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. సెల్‌టవర్లు నిరంతరం పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వరదల్లో చిక్కుకున్న బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేశామన్నారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా బాధితులకు నిత్యావసరాలు, ఇతర వస్తువులు పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన ట్రాక్టర్‌పై వెళ్లి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఐటీడీఏ పీవోలు సూరజ్ ధనుంజయ్ గనోరే, కావూరి చైతన్య, ఈపీడీసీఎల్ ఎస్ఈ మూర్తి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

జిల్లాలో 825.4 మిల్లీమీటర్ల వర్షపాతం


సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తుండడంతో ఘాట్ ప్రాంతాల్లో రాత్రికి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రధాన గెడ్డలు, వాగులలో వరద ప్రవాహం అధికంగానే ఉంది. జిల్లాలోని 22 మండలాల్లో సోమవారం 825.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మారేడుమిల్లిలో 77.8, జి.మాడుగులలో 68.4, చింతూరులో 67.2, కొయ్యూరులో 55.2, ముంచంగిపుట్టులో 54.6, వి.ఆర్.పురంలో 48.6, ఎటపాకలో 45.6, కూనవరంలో 42.4 పెదబయలులో 24, డుంబ్రిగుడలో 5.2, అరకులోయలో 4.6, అనంతగిరిలో 3.2, హుకుంపేటలో 28.6, పాడేరులో 22.4, చింతపల్లిలో 3.4, జి.కె.వీధిలో 48.2, దేవిపట్నంలో 24.2, వై.రామవరంలో 33.6, అడ్డతీగలలో 43.2, రాజవొమ్మంగిలో 46.4, గంగవరంలో 37.4, రంపచోడవరంలో 41.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

జిల్లాలో ఎస్‌ఐలకు బదిలీలు

సాక్షి,పాడేరు: పలువురు ఎస్‌ఐలకు బదిలీలు చేస్తూ విశాఖ డీఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌ఐలు జి.కుమార్‌బాబు, ఎస్.గోవిందరావు, శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తున్న యు.భవానీ, కె.గోవిందరావులను జిల్లాకు బదిలీ చేశారు. అల్లూరి జిల్లాలో పనిచేస్తున్న బి.దేముడు, ఐ.రాజారావులను పార్వతీపురం మన్యం జిల్లాకు, ఎస్.సాంబ్రదొర, డి.రేణుకాలను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు.

కోడాపుట్టు వాగు దాటలేక గర్భిణి ఇబ్బందులు

- 70 కిలోమీటర్లు ప్రయాణించి ఆస్పత్రికి చేరినా దక్కని ఫలితం
- గర్భంలోనే శిశువు మృతి



గర్భిణిని జీపు ఎక్కిస్తున్న కొడాపుట్టు గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలో లక్ష్మీపురం పంచాయతీ కోడాపుట్టు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటలేక గర్భిణి పడిన ప్రసవ వేదన వర్ణనాతీతంగా మారింది. సకాలంలో ఆస్పత్రికి చేరలేక ఆమె గర్భంలోనే శిశువును కోల్పోయింది. గ్రామానికి చెందిన కె.నాగేశ్వరరావు భార్య సోనాయి(25)కి రెండు రోజులుగా పురిటి నొప్పులు వస్తున్నాయి. కోడాపుట్టు నుంచి ఎనిమిది కిలోమీటర్లు దూరంలో ముంచంగిపుట్టు ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి ఉంది. అయితే రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలతో కోడాపుట్టు వాగు దాటించలేక గ్రామానికే పరిమితం అయ్యారు. ఆదివారం ఆమెకు పురిటి నొప్పులు అధికమై పరిస్థితి విషమంగా మారింది. దీంతో కోడాపుట్టు నుంచి ఒడిశా రాష్ట్రం బెజ్జంగి మార్గంలో అతికష్టం మీద 70 కిలోమీటర్లు ప్రైవేట్ వాహనంలో ప్రయాణించి ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి మరింత విషమంగా మారడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. పాడేరు చేరగానే అప్పటికే గర్భంలో శిశువు మృతి చెందింది. దీంతో వైద్యులు సిజేరియన్ చేసి మృతి చెందిన ఆడ శిశువును బయటకు తీశారు. సకాలంలో తీసుకువచ్చి ఉంటే శిశువు బతికి ఉండేదని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం సోనాయి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్య సేవలు అందిస్తున్నారు. కోడాపుట్టు వాగుపై వంతెన లేక నిత్యం ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని గ్రామ గిరిజనులు, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్ వాపోతున్నారు. తక్షణమే వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఇదీ మా గుండె చప్పుడు!

- పాడేరులో మెడికల్ కళాశాల పూర్తి చేయాలి
- ఫ్యామిలీ డాక్టర్ విధానం కొనసాగాలి
- జీవో నెం.3 పునరుద్ధరించాలి
- కొత్త ప్రభుత్వంపై గిరిజనుల ఆశలు



సాక్షి,పాడేరు: అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గిరిజనాభివృద్ధి కార్యక్రమాలు భారీగానే జరిగాయి. బాక్సైట్ జీవోలు రద్దు నుంచి మారుమూల గ్రామాలకు రోడ్లు, గెడ్డలపై వంతెనల ఏర్పాటు, ఆస్పత్రులు, పాఠశాలల అభివృద్ధి, సచివాలయాల వ్యవస్థ, రూ.500 కోట్లతో పాడేరులో మెడికల్ కళాశాల నిర్మాణం, తదితర భవన నిర్మాణాలు, సంక్షేమ పథకాలతో గిరిజనుల పక్షపాతిగా నిలిచారు. గిరిజన ప్రాంతంలో శరవేగంతో అభివృద్ధి చేస్తున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం, ఆపై ప్రభుత్వం మారింది. కూటమి అధికారంలోకి రావడం, సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించడంతో గిరిజనులంతా అభివృద్ధిని కోరుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుజేసిన అన్ని సంక్షేమ పథకాలను కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నారు. వెనుకబడిన గిరిజనుల సంక్షేమం అజెండానే ఉండాలని, రాజకీయాలకు అతీతంగా పాలకులంతా గిరిజనాభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని కోరుతున్నారు.

- గిరిజనులకు నూరుశాతం ఉద్యోగాలు ఇచ్చే జీవో నెం.3ను సుప్రీంకోర్టు గతంలో రద్దు చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో నెం.3 పునరుద్ధరణకు గిరిజన సలహా మండలి తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. ఇదే జీవో నంబరు 3పై ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో ఈ హామీని విస్మరించకుండా జీవో నంబరు 3 పునరుద్ధరించాలి.
- పాడేరులో రూ.500 కోట్లతో నిర్మితమవుతున్న మెడికల్ కళాశాల పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జిల్లా సర్వజన ఆస్పత్రిలో 420 బెడ్‌లతో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేయడంతోపాటు వైద్యనిపుణులను గత ప్రభుత్వం నియమించింది. ఈ విద్యా సంవత్సరంలో మెడికల్ కళాశాల అడ్మిషన్లు ప్రారంభించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైద్య విద్య, కార్పొరేట్ వైద్యం ఈ ఏడాది నుంచే అందుబాటులోకి తేవాలి.
- గిరిజన ప్రాంతాలలో పెండింగ్ రోడ్లు, గెడ్డలపై వంతెనల నిర్మాణాలతోపాటు నాడు–నేడు పాఠశాలలు, అంగన్‌వాడీల అభివృద్ధిని కొనసాగించాలి.
- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్య బృందాలు గిరిజన గ్రామాల్లో ఇంటింటా తిరిగి గిరిజనులకు సత్వర వైద్యం అందించే కార్యక్రమం ప్రస్తుతం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఇంటింటా వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని కోరుతున్నారు.

గిరిజనులకే ఉద్యోగాలివ్వాలి



గిరిజనులకు స్థానికంగానే నూరుశాతం ఉద్యోగాలిచ్చే జీవో నెం.3ని పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వచ్చినందున హామీని నిలబెట్టుకుని న్యాయం చేయాలి.

–కిల్లో శ్రీనుబాబు, రవ్వలగూడ, అరకులోయ మండలం

మెడికల్ అడ్మిషన్లు ప్రారంభించాలి



పాడేరు మెడికల్ కళాశాలకు సంబంధించి ఈ ఏడాది నుంచి వైద్య విద్య అడ్మిషన్లు ప్రారంభించాలి. గిరిజన అభ్యర్థులు స్థానికంగానే వైద్య విద్య కోసం ఎదురు చూస్తున్నారు. మెడికల్ కళాశాల భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

– పి.సూర్యారావు, ఏబీవీపీ జిల్లా కన్వీనర్, పాడేరు

క్లుప్తంగా

సకాలంలో వైద్యం అందక వృద్ధురాలి మృతి

వాగు ఉధృతి వల్లే అంటున్న గింజర్తి గ్రామస్తులు


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సర్పంచ్ శుభలక్ష్మి

రాజవొమ్మంగి: మండలంలోని గింజర్తి గ్రామానికి చెందిన కుంజం రాజులమ్మ (60)కు ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించింది. నొప్పితో విలవిలలాడుతున్న ఆమెను కుటుంబీకులు రాజవొమ్మంగి పీహెచ్‌సీకి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యలో వట్టిగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో ముందుకు వెళ్లేందుకు వీలుకాలేదు. అంతలో ఆమె మరణించిందని సర్పంచ్ ఆడూరి శుభలక్ష్మి తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

యువకుడి అదృశ్యం


జయవర్ధన్ (ఫైల్)

కొయ్యూరు: పెదమాకవరం పంచాయతీ కత్తిరాలలొద్దికి చెందిన రీమెల జయవర్ధన్ (22) అదృశ్యం కావడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం విశాఖ నుంచి వస్తూ స్వగ్రామం కత్తిరాలలొద్దికి వెళ్తున్నట్టు తెలిసిందని, అయితే నేటి వరకు ఆచూకీ లేదని కుటుంబసభ్యులు తెలిపారు. కత్తిరాల లొద్దికి వెళ్లే దారిలో గెడ్డ ఉందని, అయితే అతను గెడ్డ దాటుతున్నట్టు స్థానికులు ఎవరూ చూడలేనట్టు చెబుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రామకృష్ణ, తహసీల్దార్ రాజేశ్వరరావు, సోమవారం పెదమాకవరం వెళ్లారు. గెడ్డ దాటుతున్నట్టుగా ఎవరు చూడలేదని స్థానికులు వారికి తెలిపారు. జయవర్ధన్‌కు ఫిట్స్(మూర్ఛ) ఉందని, ఆయన గ్రామానికి వెళ్లే ముందు ఫిట్స్ రావడంతో స్థానికులు సపర్యలు చేశారన్నారు. దీనిపై ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ జయవర్ధన్ అదృశ్యంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. సమాచారం తెలియడంతో ఆ ప్రాంతానికి వెళ్లామన్నారు. ఆయన ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వెతకాలని సూచించినట్టు చెప్పారు.

విద్యుదాఘాతానికి యువకుడి దుర్మరణం

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో ఓ యువకుడు విద్యుద్ఘాతానికి గురై మృతి చెందినట్టు ఏఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. అనంతవరం గ్రామానికి చెందిన కశిరెడ్డి అప్పారావు (29) సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడి కక్కడే మృతి చెందాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడు అప్పారావుకు ఇంకా వివాహం కాలేదు.

గరీబ్‌రథ్.. న్యూ లుక్

- కొత్త కోచ్‌లలో హాయి... హాయి..
- గరీబ్‌రథ్‌కు పాత కోచ్‌ల తొలగింపు
- నేటి నుంచి కొత్త కోచ్‌లతో పరుగులు
- పెరగనున్న సీటింగ్ సామర్థ్యం
- అత్యాధునిక వసతులతో కూడిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

తాటిచెట్లపాలెం(విశాఖ): రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్. విశాఖ నుంచి సికింద్రాబాద్ ప్రతిరోజూ నడిచే గరీబ్‌రథ్ ఇక నుంచి కొత్త లుక్‌లో కనిపించనుంది. ఈ రైలుకు ఎల్‌హెచ్‌బీ (లింక్ హాఫ్‌మన్ బుష్) బోగీలుగా మార్చాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. ఇంతవరకు ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) బోగీలతో నడిచిన రైలు మంగళవారం నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలతో దూసుకుపోనుంది. 2008లో ప్రారంభమైన ఈ గరీబ్‌రథ్ ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) బోగీలతో నడుస్తోంది. అయితే ఈ ఐసీఎఫ్ బోగీలు పాతబడిపోయి తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలోనే ఐసీఎఫ్ బోగీలను ఎల్‌హెచ్‌బీ బోగీలుగా మార్చాలని రైల్వేశాఖ నిర్ణయించింది.

పేద, సాధారణ, మధ్యతరగతి ప్రయాణికులకు ఏసీ కోచ్‌లలో ప్రయాణం కలగా ఉండేది. కానీ భారతీయ రైల్వే 2005లో ఇటువంటి వారి కోసం తక్కువ టికెట్ చార్జీలతో ఏసీ ప్రయాణాన్ని పరిచయం చేసింది. ఇది పేదవారి కోసమే నడిచే రైలు కాబట్టి గరీబ్ రథ్ (పేదవాడి రైలు)గా నామకరణం చేశారు. మామూలు థర్డ్ ఏసీ కోచ్‌ల కంటే కొన్ని తక్కువ సదుపాయాలతో ఈ గరీబ్‌రథ్ రైళ్లు నడుస్తున్నాయి. విశాఖ నుంచి నడిచే ఏకైక గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ 2008 అక్టోబరు 25వ తేదీన ప్రారంభించారు. విశాఖ-సికింద్రాబాద్-విశాఖ మధ్య 2739/2740 నంబర్లతో నాటి నుంచి ఈ రైలు నడుస్తోంది. మొదట్లో ఈ గరీబ్‌రథ్ ట్రై వీక్లీగా నడిచేది. తదనంతరం డిమాండ్‌ను బట్టి 2010 ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రతీరోజు నడుపుతున్నారు. తరువాత ఈ రైలు నంబరు 12739/12740గా మార్చారు. భారతీయ రైల్వేలో ప్రతీరోజు నడిచే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇదొక్కటే కావడం మరో విశేషం. మిగిలిన గరీబ్‌రథ్ రైళ్లన్నీ వీక్లీ, బై వీక్లీగా నడుస్తున్నాయి.

నేటి నుంచి మారిన కోచ్‌లతో..

విశాఖ-సికింద్రాబాద్- విశాఖ గరీబ్‌రథ్ ఇప్పటివరకు పాత ఐసీఎఫ్ కోచ్‌లతో నడుస్తుంది. ఈ గరీబ్‌రథ్ మంగళవారం నుంచి అధునాతన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో పరుగులు తీయనుంది. ఇప్పటివరకు ఈ రైలు 17-థర్డ్ ఏసీ కోచ్‌లతో నడిచేది, ఇకమీదట 18 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడవనుంది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ప్రయాణికులకు మరింత సౌకర్యం, మరిన్ని అధునాతన వసతులు సమకూరనున్నాయి. సీటింగ్ సదుపాయం కూడా పెరగనుంది. మరింత వేగం కూడా పెరిగే అవకాశం ఉంది.



చార్జీలు తక్కువే...

సాధారణ మధ్య తరగతి ప్రయాణికుల కోసమే ఈ రైళ్లు ప్రవేశపెట్టారు. అందువల్ల చార్జీలు కూడా వారికి అందుబాటులో ఉండే విధంగా ఉంటాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ థర్డ్ ఏసీలో సికింద్రాబాద్ వెళ్లాలంటే చార్జీ రూ.1080 (ఒక్కరికి), అదే గరీబ్‌రథ్‌లో కేవలం రూ.770 మాత్రమే. విశాఖ నుంచి విజయవాడకు గోదావరి ఎక్స్‌ప్రెస్ థర్డ్ ఏసీ రూ.660 అయితే గరీబ్‌రథ్‌కు కేవలం రూ.495 మాత్రమే.

శాకంబరిగా దేవతామూర్తుల దర్శనం

ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అలంకరణ


శాకంబరి అలంకరణలో పద్మావతి, అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహం


శాకంబరి అలంకరణలో పార్వతీ సమేత ఉమా నీలకంఠేశ్వరస్వామి విగ్రహాలు

సాక్షి, పాడేరు: పట్టణంలోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పలు దేవతామూర్తులు శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఇక్కడ రాజరాజేశ్వరి, పార్వతీ సమేత ఉమా నీలకంఠేశ్వరస్వామి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలతోపాటు శివలింగానికి కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, దుంపజాతులతో అలంకరించారు. దేవతామూర్తుల విగ్రహాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పరవశించారు. ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

ఇన్‌స్పైర్ -మనక్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్ రీసెర్చ్(ఐఎన్ఎస్‌పీఐ ఆర్‌ఈ) – మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్స్ అండ్ నాలెడ్జ్(ఎంఎఎన్ఏకె) పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ ఇతర జిల్లా అధికారులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, జీవీఎంసీ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తోటాడ కుర్రాడికి ఐఐటీ సీటు

మునగపాక: మండలంలోని తోటాడకు చెందిన దొడ్డి సర్వన్ నాయుడు హైదరాబాద్‌లోని ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించాడు. ఈ మేరకు సోమవారం సర్వన్ నాయుడును సచివాలయం వద్ద సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తదితరులు సత్కరించారు. చదువులో రాణిస్తూ సమాజానికి మేలు చేసే సేవలందించేలా సర్వన్ నాయుడు రాణించాలని ఆకాంక్షించారు. సర్వన్‌నాయుడు చదువులో రాణించేందుకు కృషి చేసిన తల్లిదండ్రులు కిరణ్, దేవిలను అభినందించారు.

సీలేరు జలాశయాన్ని సందర్శించిన అధికారులు


జలాశయాన్ని పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు

సీలేరు: వరద ఉధృతితో పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకుంటున్న సీలేరు జలాశయాన్ని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీరు వాసుదేవరావు సోమవారం పరిశీలించారు. మధ్యాహ్నం సీలేరు జలవిద్యుత్కేంద్రానికి చేరుకున్న ఆయన ఇక్కడ యూనిట్లు పరిశీలించారు. అనంతరం సివిల్ అధికారులతో కలిసి సీలేరు గుంటవాడ జలాశయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టాలు, ఇన్‌ఫ్లో గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి సమగ్రంగా ఆయనకు వివరించారు. ప్రస్తుతం సీలేరు జలాశయం నీటిమట్టం 1,357 అడుగులకు చేరిందని, ఇన్‌ఫ్లోగా ఎనిమిది వేలు క్యూసెక్కులు గుంటవాడ జలాశయానికి వస్తున్నాయని, ఏ క్షణంలోనైనా గేట్లు ఎత్తివేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసి, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. సీఈ వాసుదేవరావు మాట్లాడుతూ జలాశయం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గేట్లు పనితీరు, విద్యుత్తు అంతరాయం ఏర్పడితే ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గాను జనరేటర్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ ప్రభాకర్ రావు, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ పసికందు మృతి


రాజవొమ్మంగి పీహెచ్‌సీలో మరణించిన బాబు

రాజవొమ్మంగి: మండలంలోని వయ్యేడు గ్రామానికి చెందిన రెళ్ళెల్ల పసికందు సోమవారం ఉదయం స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మరణించింది. ఆదివారం రాత్రి కడుపు నొప్పితో విలవిలలాడటంతో సోమవారం ఉదయం పీహెచ్‌సీకి తీసుకెళ్లగా, అక్కడ డాక్టర్లు పరీక్షించి నర్సీపట్నం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఇంతలోనే మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తనకు తొలికాన్పులో పుట్టిన పండంటి మగబిడ్డను ఎంతో అపురూపంగా చూసుకుంటున్నామని, ఇంతలో ఇలా జరిగిందని చిన్నారి తల్లి చీడి గౌతమి ఆవేదన వ్యక్తం చేసింది. లాగరాయి పీహెచ్‌సీలో ప్రసవం పొందిన ఈమె అప్పటి నుంచి పుట్టినిల్లు తాళ్లపాలెంలో ఉంటోంది. ఈ విషయంపై పీహెచ్‌సీ వైద్యులను వివరణ కోరగా... పీహెచ్‌సీకి బాబును తీసుకొచ్చేసరికే అపస్మారక స్థితిలో ఉన్నాడని, ఊపిరితిత్తుల్లోకి పాలు వెళ్లడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని తెలిపారు. చంటి పిల్లలకు పడుకుని పాలు పట్టకూడదన్నారు. పొత్తిళ్లలో వేసుకుని పాలు పట్టిన తర్వాత బిడ్డను భుజానికి ఎత్తుకుని కాసేపు అటు ఇటు తిరగాలని సూచించారు.

కుష్టు నివారణే లక్ష్యం

- ఆగస్టు 2 వరకు ఇంటింటా ఎల్సీడీసీ సర్వే
- వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స


డోర్ టూ డోర్ సర్వే

మహారాణిపేట(విశాఖ) : జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్సీడీసీ) సర్వే-24 పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లాలో 925 మంది ఆశ కార్యకర్తలు, 54 మంది ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, 86 ఎంపీహెచ్ఎస్‌లు, 72 మెడికల్ ఆఫీసర్లు సర్వే కోసం పనిచేస్తున్నారు. రేవిడి, ఆర్.తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ఎక్కువగా దృష్టి సారించారు. సర్వేలో భాగంగా బృందాలు గుర్తించిన కొత్త కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి పూర్తి స్థాయిలో వైద్యం అందించి దశలవారీగా కుష్టు వ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి వైద్యం అందిస్తే అంగవైకల్యం రాకుండా నిరోధించవచ్చని వైద్యులు అంటున్నారు. కుష్టు వ్యాధి సోకిన వ్యక్తి ముక్కు నుంచి ద్రవంతో దగ్గు లేదా స్పర్శ ద్వారా వ్యాప్తి చెందుతుంది.

తగ్గుతున్న వ్యాధిగ్రస్తులు

రాను రాను ఈ వ్యాధి తగ్గుముఖం పడుతోంది. 2022లో 96 కేసులు నమోదు కాగా 2023లో 81 కేసులు నమోదయ్యాయి. 2021లో 104 కేసులు నమోదయ్యాయని కుష్టు నివారణాధికారి డాక్టర్ సత్యవాణి తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి రెండు పద్ధతుల ద్వారా వైద్య సేవలందిస్తారు. శరీరంపై ఐదు మచ్చలున్న వారికి పాసిబ్యాసిలరీ(పీబీ) విధానంలో ఆరు నెలలు పాటు చికిత్స అందిస్తారు. అలాగే ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలలు చికిత్స అందిస్తారు. దీనిలో భాగంగా నెలకు ఒక సారి ఆయా రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది మందులు అందిస్తారు.

సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు ఆ వ్యాధిపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నివారించవచ్చు. 1987 తర్వాత నుంచి బహుళ ఔషధ చికిత్స(మల్టీ డ్రగ్ థెరఫీ) ద్వారా వ్యాధిని అరికడుతున్నారు. వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఇవీ..

- చర్మంపై స్పర్శలేని రాగి రంగు గల మచ్చలు
- చెవులపై బొడిపెలు, కణితులు, నరాల తిమ్మిర్లు
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం(చర్మం ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలాగా ఉండటం),
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలి పోవడం
- కనురెప్పలు మూతపడకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం
- చేతివేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగ వైకల్యం రావడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- పాదాల మడమల్లో వాపు
- ముప్పు దిబ్బడం, ముక్కు నుంచి రక్తం కారడం

సర్వేకు సహకరించాలి



కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత లేకుండా నివారణకు కృషి చేయాలి. గ్రామస్థాయిలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఆగస్టు 2వ తేదీ వరకు జిల్లాలో సర్వే జరుగుతుంది. వ్యాధి లక్షణాలు ఉన్న వారు వివరాలు అందించాలి. ఏమాత్రం అనుమానం ఉన్నా.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా కుష్టు నివారణ అధికారి

బైక్ వెనుక ఉన్న వారికి హెల్మెట్ తప్పనిసరి

- లేకుంటే రూ.1035 చలానా
- 44 జంక్షన్లలో హెల్మెట్ ధారణపై అవగాహన
- హెల్మెట్ లేకుండా ప్రమాదానికి కారణమైతే తాత్కాలికంగా లైసెన్స్ రద్దు


మాట్లాడుతున్న ఏడీసీపీ శ్రీనివాసరావు

విశాఖ సిటీ: ద్విచక్ర వాహన చోదకులతోపాటు వెనుక కూర్చున్న వారు సైతం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల ప్రకారం హెల్మెట్ ధారణపై నగరంలోని 44 ప్రధాన జంక్షన్లలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెల్మెట్లు కూడా బీఐఎస్ మార్కు ఉన్న వాటినే ధరించాలని సూచించారు. బైక్ నడిపే వారే కాకుండా వెనుక కూర్చున వారు హెల్మెట్ ధరించకపోయినా రూ.1035 చలానా విధిస్తామని తేల్చి చెప్పారు. హెల్మెట్ ధరించకుండా ప్రమాదానికి కారణమైన వారి డ్రైవింగ్ లైసెన్సు మూడు నెలల పాటు సస్పెండ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్పొరేట్ సంస్థ సహకారంతో కొంత మందికి హెల్మెట్లు అందించే కార్యక్రమం గురించి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆలోచన చేస్తున్నారని వివరించారు. త్వరలోనే దీనిపై విధి విధానాలను రూపొందించి ప్రకటిస్తామని వెల్లడించారు.

చలానాలు చెల్లించాలి

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చలానాలు వేయడం జరుగుతోందన్నారు. ఆ చలానాలను మొబైల్‌లోని యాప్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. ఇందుకోసం ప్లేస్టోర్ నుంచి ్రస్మ్భఎ్ఝ ఝ్కుటజీఠ్భజ్ఞీ ఽ అనే అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని అందులో అడిగిన వివరాలు నింపి ఎం పిన్ జనరేట్ చేసుకోవాలని చెప్పారు. అప్లికేషన్‌లో ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ అనే ఐకాన్ క్లిక్ చేసిన తరువాత పేమెంట్ చలానా అనే ఆప్షన్ ఎంచుకొని, వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్, చివరి 5 అంకెల ఛాసిస్ నెంబర్, ఇంజన్ నెంబర్ ఎంటర్ చేసి వాహనంపై ఉన్న చలానాలు తెలుసుకోవచ్చన్నారు.

పారిస్ ఒలింపిక్స్‌కు విశాఖవాసి సేవలు

టెక్నికల్ అఫీషియల్‌గా బాక్సింగ్ వెంకటేశ్వరరావు

విశాఖ స్పోర్ట్స్ : పారిస్ ఒలింపిక్స్‌లో విశాఖకు చెందిన బాక్సింగ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు సేవలందించనున్నారు. ద్రోణాచార్య అవార్డీ వెంకటేశ్వరరావు ఈ మేరకు భారత బాక్సింగ్ సమాఖ్యనుంచి సోమవారం ఉత్తర్వులు అందుకున్నట్లు సాక్షి కి తెలిపారు. టెక్నికల్ అఫీషియల్స్ న్యూఢిల్లీ నుంచి బుధవారం బయలుదేరనున్నామన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న కాంటింజెంట్ అరుగురు సభ్యులు ఇప్పటికే జర్మనీలో ప్రీఒలింపిక్ సెషన్ ఈవెంట్‌లో శిక్షణ పొందుతున్నారు. భారత్ నుంచి తొమ్మిది మంది శిక్షకులు, సపోర్టింగ్ స్టాఫ్‌గా ఒలింపిక్స్‌లో సేవలందించేందుకు సమాఖ్య ఎంపిక చేయగా వారిలో వెంకటేశ్వరరావు ఒకరు. ఈయన గతంలో విశాఖలోని భారత క్రీడా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంటర్(సాయ్)లో కోచ్‌గా సేవలందించి పదవీ విరమణ చేశారు. ప్రస్తుత బాక్సింగ్ కాంటింజెంట్‌లో ఉన్న నిఖత్ జరీన్ (50కేజీలు), లవ్లీ బొర్గేన్ (75కేజీలు) గతంలో విశాఖ సెంటర్‌లోనే ఆయన వద్ద శిక్షణ పొందారు.

మధ్యవర్తిత్వంపై న్యాయమూర్తులకు శిక్షణ

మహారాణిపేట: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై సోమవారం జిల్లా నూతన కోర్టుల సముదాయ భవనంలో ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జునైద్ అహ్మద్, విజయనగరం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా ఇన్‌చార్జీ, జిల్లా సెషన్స్ జడ్జి యు.యు.ప్రసాద్, ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి (విశాఖపట్నం), సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వం- సంధి ప్రాజెక్ట్ కమిటీ సీనియర్ శిక్షకుడు (ఎంసీపీసీ, న్యూఢిల్లీ) సీ.హెచ్.సురేందర్ సింగ్, విపి తంకచన్, విశాఖ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ-కమ్-సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ ఆఖరి దశ కౌన్సెలింగ్

మురళీనగర్: ఏపీఈఏపీసెట్ తుదిదశ కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభం అవుతుందని కంచరపాలెం పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు వారికి కేటాయించిన కాలేజీల్లో చేరడానికి సోమవారంతో గడువు ముగిసింది. ఆయా కాలేజీల్లో మిగిలిన సీట్లు బుధవారం నాటికి సాంకేతిక విద్యాశాఖకు చేరుతుంది. ఆఖరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కన్వీనరు/డీటీఈ ప్రకటించారని తెలిపారు. 23 నుంచి 25 వరకు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల పరిశీలన, ఆన్‌లైన్‌లో సమర్పించిన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. 24 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు, 27న ఆప్షన్ల మార్పిడికి అవకాశం ఇచ్చారు. ఈనెల 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. ఈనెల 31 నుంచి ఆగస్టు 3వ తేదీలోగా సెల్ఫ్ రిపోర్టుతోపాటు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు.

వరి పంట రైతులకు సూచనలు


చిన్నగెడ్డలో పంట పొలాలను పరిశీలిస్తున్న చింతపల్లి ఏడీఏ జాహ్నవి


బంగారుమెట్టలో వరి నారును పరిశీలిస్తున్న జిల్లా ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ తేజేశ్వరరావు

పెదబయలు: జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం అల్పపీడనం వలన కురుస్తున్న వర్షాలకు విత్తన నారుమడి దశలో ఉన్న వరి పంట ముంపుకు గురురవుతుందని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం పాడేరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.తేజేశ్వరరావు అన్నారు.సోమవారం పెదబయలు సీకరి పంచాయతీ బంగారుమెట్ట, సీతగుంట పంచాయతీ సీతగుంట, ముసిడిపుట్టు,అడుగులపుట్టు పంచాయతీల్లో పర్యటించి నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరి నాట్లు,నారు మడులు ఎంత మేరకు నీట మునిగిందని పరిశీలించారు.వర్షాలకు నారుమడిలో విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో 3 రోజుల కన్న ఎక్కువ రోజులు నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని వీలైనంత త్వరగా నీరు బయటకు పంపే ప్రయత్నం చేయాలని ఈ దశలో ముంపునకు తట్టుకునే భీమ(ఎంటీయూ-1140) రకం విత్తనం విత్తిన 10 రోజుల వరకు ముంపునకు తట్టుకుంటుందన్నారు.అలాగే విత్తిన 7 రోజుల నుంచి 30 రోజుల మధ్యలో నారు 5 రోజుల కన్న ఎక్కువ రోజుల మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందని ఎంటిటీ-1232 రకం విత్తిన 15 నుండి 70 రోజుల వరకు ముంపును తట్టుకుంటుందని, మునిగిన నారు మడిలోని నీరు 5 రోజుల లోపు బయటకు తీసిన తరువాత 5 సెంట్ల నారు మడిలో 1 కిలో యూరియ 1 కిలో పొటాష్ వేసుకుని 1 గ్రాము కార్బండైజిమ్ లేదా 2 గ్రాముల కార్బండైజిమ్ మరియు మాంకోటెక్ పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పిలక దశలో సాధారణ రకాలు 5 రోజుల వరకు నీట మునిగినా ఇబ్బంది ఉండదన్నారు. ఎంటీయూ-1140, 1172, 1223, 1064, పిఎల్-1100 రకాలు వారం రోజుల పాటు నీటి ముంపును తట్టుకుంటుందన్నారు. భూసారం అనుగుణంగా వరి రకాలు వేసుకుంటే ప్రయోజనం ఉంటుందన్నారు. వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు సలహాలు సూచనలు అందించాలన్నారు. తుపానుల వల్ల వరి నాటు నష్టాలను ఆయన పరిశీలించారు.అనంతరం పెదబయలు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ, హార్టీకల్చర్ సహాయకులకు అవగాహన కల్పించారు. జిల్లా ఏరువాక కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ పి.బి.ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

చింతపల్లిరూరల్:కుండపోతగా కురుస్తున్న వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి ఏడీఏ కంఠ జాహ్నవీ అన్నారు. మండలంలో చౌడుపల్లి, చిన్నగెడ్డ , గొందిపాకలు, పెదబరడ గ్రామాల్లో ఆమె సోమవారం పర్యటించి, పొలాలను పరిశీలించారు.ఈ వర్షాలు రైతులు వరి నాట్లు వేసుకోవడానికి అనుకూలమన్నారు. వరి, వెరుశెనగ పంటల్లో నిల్వ నీటిని బయటకు పంపేలా రైతులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ ,ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.